సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 3 । అక్టోబర్ । 2024

మొసళ్లున్నాయ్ జాగ్రత్త!



డొంకరాయి డ్యామ్‌పై మంగళవారం రాత్రి పది గంటల సమయంలో సుమారు ఎనిమిది అడుగుల పొడవు ఉన్న మొసలి హల్ చల్ చేసింది. దీనిని గమనించిన జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది రామన్నదొర చాకచక్యంగా తాడుతో కట్టి డొంకరాయి జలాశయంలో విడిచిపెట్టారు. మొసళ్లు సంచరిస్తున్నందున ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. - మోతుగూడెం

న్యూస్‌రీల్

మహాత్మా.. నిన్ను మరువలేం

• కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టరేట్‌లో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్ తదితరులు

సాక్షి,పాడేరు: సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని ఉద్యమం చేపట్టి దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ సేవలను ఎన్నటికీ మరువలేమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గాంధీ, దేశ రెండవ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్‌గౌడ్,ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంతో గాంధీజీ పోరాటం చారిత్రాత్మకమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లాల్‌బహదూర్‌శాస్త్రి దేశ ప్రగతికి విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.పద్మావతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ రాజబాబు

అరకులోయ రూరల్: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ రాజబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ ఈనెల 3 నుంచి ఆరు వరకు విజయవాడ దండమూరి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో జరిగే క్వాలిఫైడ్ పోటీల్లో చంద్రశేఖర్ అండర్-17 విభాగంలో కె.సూర్య అండర్-15 విభాగంలో పాల్గొంటారని తెలిపారు.

జూలో వెటర్నరియన్ పోస్టుకు దరఖాస్తులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో వెటర్నరియన్ పోస్టు కాంట్రాక్ట్ బేసిస్‌పై భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. నెలకు రూ.50,000 వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5గంటల లోగా జూ క్యూరేటర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



డాబాగార్డెన్స్ (విశాఖ): దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ విశాఖపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు 250 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ప్రజా రవాణాధికారి ఎ.అప్పలరాజు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో ఎటువంటి అదనపు చార్జీలు ఉండవని పేర్కొన్నారు. అలాగే ముందస్తుగా అప్ అండ్ డౌన్ ప్రయాణానికి సంబంధించి రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌కు 40, విజయవాడకు 40 నుంచి 50, రాజమండ్రి, కాకినాడ సెక్టార్‌కు 40 అదనపు బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టామన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, బొబ్బిలి, రాజాం, పాలకొండ, సాలూరు తదితర ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు చెప్పారు. ఈ నెల 8 నుంచి 12 వరకు హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే బస్సులన్నీ ఫుల్ అయినట్టు సమాచారం మేరకు.. దసరా పండగ తర్వాత విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

మేల్కొకుంటే మళ్లీ ముప్పే..

గూడెంకొత్తవీధి-భద్రాచలం అంతర్ రాష్ట్ర రహదారి ఇప్పటిలో బాగుపడే పరిస్థితి కనిపించడంలేదు. కొండచరియల విధ్వంసానికి నామరూపాలు లేకుండా పోయిన ఈ రహదారికి శాశ్వత మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే ఈ మార్గానికి మరింత నష్టం జరిగే పరిస్థితులు ఉన్నాయని సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొండచరియలు విరిగిపడి జీకేవీధి- సీలేరు మధ్య అంతర్ రాష్ట్ర రహదారి ధ్వంసం
- నెలరోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో మెరుగుపడని రోడ్డు
- తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకున్న అధికారులు
- శాశ్వత పనులకు నిధులు మంజూరు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినా చర్యలు శూన్యం
- ఆర్టీసీ బస్సులు తిరగక ప్రజల అవస్థలు



అంతర్ రాష్ట్ర రహదారిలో గూడెంకొత్తవీధి-సీలేరు మధ్య తాత్కాలికంగా మెరుగుపరచిన ప్రాంతం

సాక్షి,పాడేరు/సీలేరు: గూడెంకొత్తవీధి-సీలేరు అంతర్ రాష్ట్ర రహదారికి మళ్లీ ముప్పు పొంచి ఉంది. ఇటీవల సంభవించిన వరదలకు ఈ మార్గంలో రోడ్డు పలుచోట్ల ధ్వంసమవడం తెలిసిందే. ఎక్కడికక్కడ రోడ్డు కోతకు గురైంది. కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. కొండచరియలు రోడ్డుపైకి విరిగిపడి బీభత్సం సృష్టించాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో రోడ్లు భవనాలశాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రోడ్డును వినియోగంలోకి తెచ్చారు. మొదట్లో చిన్న వాహనాలు మాత్రమే నడిచేవి. రెండు రోజుల నుంచి పెద్ద వాహనాలు కూడా తిరుగుతున్నాయి. అయితే వంతెనల వద్ద పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వాహనచోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈమార్గం పూర్తిస్థాయిలో మెరుగు పడకపోవడం వల్ల వర్షం కురిసినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. భారీ వర్షం కురిస్తే మళ్లీ నష్టం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రూ.46 కోట్లతో ప్రతిపాదనలు

గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీ నగర్ నుంచి సీలేరు వరకు ఆర్అండ్‌బీ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు కల్వర్టులు, వంతెనల నిర్మాణానికి రూ.46 కోట్లతో అధికారులు ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించారు. ఈ రోడ్డు పరిశీలనకు వచ్చిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా రోడ్ల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పునరుద్ధరించని ఆర్టీసీ సర్వీసులు

తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో రోడ్డు అందుబాటులోకి వచ్చి దాదాపుగా నెల రోజులు సమీపిస్తున్నా ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు పునరుద్ధరించలేదు. దెబ్బతిన్న వంతెనల దిగువ భాగంలో కాంక్రీట్ పనులు చేపట్టి పటిష్టపరిచారు. అయినప్పటికీ విశాఖపట్నం- సీలేరు, నర్సీపట్నం- సీలేరు బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో ఈ మార్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్ ఆపరేటర్ల దోపిడీ

ఆర్టీసీ బస్సులు తిరగకపోవడాన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి గుంజేస్తున్నారు. సీలేరు నుంచి విశాఖపట్నానికి ఆల్ట్రా డీలక్స్ టికెట్ ధర రూ.380. ప్రైవేట్ ఆపరేటర్లు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లక తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



మంగళవారం రాత్రి ఎట్టకేలకు సీలేరు చేరుకున్న పాడేరు డిపో ఆర్టీసీ బస్సు



రోడ్డుపై పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం



సీలేరు రోడ్డు ప్రాధాన్యత దృష్ట్యా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. ఈ మేరకు ప్రభుత్వానికి రూ.46 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గిరిజన శాఖ మంత్రి కూడా నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. కొద్ది రోజుల్లో నిధులు మంజూరయ్యే పరిస్థితి ఉంది.

-ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

ఆశయం.. ఆదర్శం

ముంచంగిపుట్టు ఎంపీడీవో కిరణ్ కుమార్ మిత్రబృందం ఆదర్శంగా నిలిచారు. పాఠశాల భవనం లేక పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వారు సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. చేయి చేయి కలిపి నిధులు సమకూర్చారు. భవనాన్ని నిర్మించి విద్యార్థుల్లో వెలుగులు నింపారు.



స్నేహితుల సహకారంతో ఎంపీడీవో కిరణ్‌కుమార్ నిర్మించిన పాఠశాల భవనం

- ముంచంగిపుట్టు ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఔదార్యం
- స్నేహితుల సహకారంతో టొంగికోటలో పాఠశాల భవన నిర్మాణం
- రూ.2.20 లక్షలు సమకూర్చిన మిత్రబృందం
- విద్యార్థులకు వసతి సమస్య పరిష్కారం
- మరికొన్ని పాఠశాలలకు భవనాలు నిర్మిస్తామని వెల్లడి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: మండల అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు.వనభసింగి పంచాయతీ టొంగికోటలో విద్యార్థులు చదువుకునేందుకు భవన వసతి లేకపోవడంపై ఆయన చలించిపోయారు. తన స్నేహితుల సహకారంతో రూ.2.20 లక్షలు సమకూర్చి పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఈ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల భవనంపై ఇటీవల ఈదురుగాలులకు భారీ వృక్షం కూలింది. దీంతో భవనం నేలమట్టం అయింది. అప్పటినుంచి విద్యార్థులకు వసతి సమస్య ఏర్పడింది. దీంతో 23 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్ తన స్నేహితులతో చర్చించారు. ఆయనకు వారు కూడా సహకారం అందించారు. ఇలా సమకూర్చిన రూ.2.20 లక్షలతో భవనాన్ని నిర్మించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం నెలకొంది.

సహాయగుణం అభినందనీయం: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

విద్యార్థులకు భవన సమస్య పరిష్కరించడంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, అతని స్నేహితుల సహాయగుణం అభినందనీయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రశంసించారు. టొంగికోటలో నిర్మించిన భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన స్నేహితుల సహకారంతో మంచి కార్యక్రమం చేపట్టామన్నారు. టొంగికోటలో మాదిరిగానే వారి సహకారంతో భవిష్యత్తులో మరికొన్ని పాఠశాలలకు భవనాలు నిర్మిస్తామన్నారు. చదువుతోనే పేదల రాతలు మారుతాయని, గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆయనను టొంగికోట గ్రామస్తులు, విద్యార్థులు, జెడీ చైర్మన్ సుభద్ర శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ లక్ష్మణ్, ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సింహాద్రి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి గర్భాలయ ప్రవేశాలు రద్దు

డాబాగార్డెన్స్ (విశాఖ): కనక మహాలక్ష్మీ దేవస్థానంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజుల్లో పంచామృతాభిషేకం, మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన, శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవ, శనివారం నిర్వహించే లక్ష తులసిపూజ, తదితర విశేష సేవలు, పూజలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ రోజుల్లో అమ్మవారి గర్భాలయ దర్శనాలు కూడా ఉండవని స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ ముందుండాలి

- సామాజిక బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత
- గ్రామ సభలో కలెక్టర్ దినేష్‌కుమార్



వంజంగి గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన గ్రామాల బాగుకోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, పరిసరాల పరిశుభ్రత కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వంజంగి గ్రామసచివాలయంలో బుధవారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మాగాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని ఆరు పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి,వాటిని వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తామన్నారు.గ్రామాల అభివృద్ధితో పాటు పచ్చదనం,పర్యావరణం,పరిసరాల పరిశుభ్రతపైన గిరిజనుల్లో అవగాహన పెరగాలన్నారు.ప్రతి శుక్రవారం గిరిజనులంతా రెండు గంటల పాటు శ్రమించి గ్రామాల స్వచ్ఛతకు కృషి చేయాలన్నారు.అక్టోబర్ నుంచి జనవరి వరకు వంజంగిలో పర్యాటకుల సంచారం ఎక్కువగా ఉంటున్నందున పర్యావరణానికి భంగం కలగకుండా చూడాలన్నారు. సీనియర్ సిటిజన్లతో అభివృద్ధిపై వారి అనుభవాలను మాట్లాడించారు. అనంతరం 16మంది సీనియర్ సిటిజన్లు, 20మంది క్లాప్ మిత్రలను సత్కరించారు. అంతకుముందు కలెక్టర్ మొక్కలు నాటారు.అలాగే స్క్రీన్ ద్వారా ప్రధాని నరేంద్రమోది ప్రసంగాన్ని గిరిజనులంతా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కొండలరావు,ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కె.జవహర్‌కుమార్, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ ,కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ప్రతినిధి అశిష్‌యాదవ్, ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధి నాగరాజు, పిరమిడ్ సంస్థ ప్రతినిధులు నారాయణరెడ్డి,రేష్మ,ఎంపీడీవో సాయినవీన్,తహసీల్దార్ వంజంగి త్రినాథ్‌రావునాయుడు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎంపీటీసీ లకే పాత్రుడు,సర్పంచ్ బొంజుబాబు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు సర్వంసిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- ఆలయాల ముస్తాబు



శరన్నవరాత్రుల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



అరకులోయలో భ్రమరాంబ దేవి

సాక్షి,పాడేరు: శరన్నవరాత్రులకు జిల్లాలోని పలు దేవతామూర్తుల ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు జిల్లా కేంద్రం పాడేరులోని కనకదుర్గమ్మతల్లి, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని రాజరాజేశ్వరిదేవి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. చింతలవీధి, ఇరడాపల్లి, కొత్తపాడేరు, వంతాడపల్లి ప్రాంతాల్లోని దుర్గమ్మతల్లి ఆలయాలను సిద్ధం చేశారు. అరకులోయ పట్టణంలోని మల్లికార్జునస్వామి సమేత భ్రమరాంబదేవి ఆలయంలో ఏర్పాటు చేశారు.

ఉత్సవాల ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ

పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి విగ్రహం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఈనెల 12 వరకు జరిగే ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అర్చకుడు రామంపంతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఆధ్యాత్మిక ప్రతినిధులు సిద్ధనాతి కొండలరావు, రాజబాబు, సత్యనారాయణ, దేశిది బాబూరావు, ఉడా త్రినాథ్, సోమరాజు పాల్గొన్నారు.

ఏకలవ్యతో నాణ్యమైన విద్య



లకేపుట్టులో ఏకలవ్య భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ దినేష్‌కుమార్



మజ్జివలసలో ఏకలవ్య పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శెట్టి రోషిణి



భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీపీ తదితరులు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- ఏకలవ్య పాఠశాల భవనాలను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- స్థానికంగా ప్రజాప్రతినిధులు, అధికారులు శిలాఫలకాల ఆవిష్కరణ

పెదబయలు: గిరిజన విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించడమే ఏకలవ్య పాఠశాలల లక్ష్యమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టుసమీపంలో రూ.20 కోట్లతో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని బుధవారం వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. భవనంలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏకలవ్య పాఠశాలల్లో పూర్తి సదుపాయాలు కల్పిస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునే బాధ్యత విద్యార్థులు, తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందన్నారు. పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన వారికి అభినందనలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతీ మండలానికి ఒక ఏకలవ్య పాఠశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. పాడేరులో వైద్య కళాశాల, గిరిజన యూనివర్సిటీ మంజూరు అయ్యాయన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థుల్లో మార్పునకు ఏకలవ్య పాఠశాలలు నాంది కానున్నాయన్నారు. అంతకుముందు పీఎం ప్రసంగాన్ని స్క్రీన్‌పై తిలకించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, ట్రైకార్ కమిటీ మెంబర్ కూడ రాజుబాబు, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ కె. బొంజుబాబు, ఎంపీడీవో విగ్గిన్స్, తహసీల్దార్ రంగారావు, మాజీ ఎంపీపీలు జర్సింగి బాలంనాయుడు, జర్సింగి సూర్యనారాయణ, వి.కొండయ్య, వైస్ ఎంపీపీ రాజుబాబు, పాడేరు గురుకుల ప్రిన్సిపాల్ మూర్తి, పెదబయలు, ముంచంగిపుట్టు ఏకలవ్య ప్రిన్సిపాళ్లు అమిత్‌కుమార్ ఆనంద్, కేశవరావు పాల్గొన్నారు.

ఏకలవ్యతో బంగారు భవిష్యత్: అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: ఏకలవ్య పాఠశాలల ఏర్పాటుతో గిరి విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని మట్టుజోరు పంచాయతీ నక్కలపుట్టులో రూ.40 కోట్లతో మంజూరైన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి బుధవారం పీఎం మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఏకలవ్య పాఠశాలల మంజూరుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేసిందన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంఈవో సోమెలి చెల్లయ్య, హుకుంపేట, పాడేరు ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు సంతోష్ సజ్వాల్‌కుమార్, ప్రభాకర్, సర్పంచ్‌లు బాకురు వెంకటరమణ, సమిడ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలో బొండం పంచాయతీ మజ్జివలసలో రూ.40 కోట్లతో నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవనాన్ని జార్ఖండ్ నుంచి పీఎం మోదీ వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించారు.అనంతరం స్థానికంగా జెడ్పీటీసీ శెట్టి రోషిణి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచ్ భాస్కర్‌రావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక నేతలు నర్సింహమూర్తి, అర్జున్, రామ్మూర్తి, బాబూరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పింఛనుకోసం పండుటాకుల నరకయాతన

- ఇళ్లకు వెళ్లని గ్రామ సచివాలయ సిబ్బంది
- కిలోమీటర్ల కొద్దీ లబ్ధిదారులు వెళ్లాల్సిన దుస్థితి



తులబాలగెడ్డ వద్ద పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

కొయ్యూరు: పింఛను సొమ్ము పొందేందుకు పండుటాకులు నరకం చూశారు. గ్రామసచివాలయ సిబ్బంది ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నట్టు జిల్లా అధికార యంత్రాంగం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. డౌనూరు పంచాయతీలో గొప్పువీధి, జోడుమామిడి, నిమ్మలపాలెం పింఛనుదారులు మంగళవారం ఎదుర్కొన్న ఇబ్బందులే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. డౌనూరు పంచాయతీలో గొప్పువీధి, జోడుమామిడి, నిమ్మలపాలెం గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉంది. అయినప్పటికీ గ్రామసచివాలయ సిబ్బంది వారి ఇళ్లవద్దకు వెళ్లలేదు. ఆయా గ్రామాలకు చెందిన పింఛనుదారులందరిని ఇదే పంచాయతీలోని తులబాలగెడ్డ వద్దకు రప్పించారు. దీనివల్ల నాలుగు కిలోమీటర్లు రావాల్సి వచ్చిందని పింఛనుదారులు వాపోయారు. సిబ్బంది వచ్చే వరకు పడిగాపులు పడాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ సమస్యను గుర్తించి గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సన్మానిస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్‌కుమార్

పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును బుధవారం లోచలిపుట్టు క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడి సారథ్యంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పార్టీని ఏకతాటిపైకి తెచ్చి నడిపించే సత్తా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఉందన్నారు.

నూతన మద్యం పాలసీ రద్దు చేయాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మహిళలు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన మద్యం పాలసీ రద్దు చేయాలని గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షురాలు సానియా ఈశ్వరి, కార్యదర్శి సీసా విజయ డిమాండ్ చేశారు. మండల గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కల్యాణ మండపం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మద్యంపై ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మద్యం విధానం వల్ల ఆడపిల్లలు వీధుల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. లైంగికదాడులు, కుటుంబ కలహాలు పెరుగుతాయన్నారు. నూతన విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని, వారంలో ఆదివారం మద్యం షాపులకు సెలవు దినంగా ప్రకటించాలని, లేని పక్షాన మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సంఘ సభ్యులు రాధ, దోసుద, ఈశ్వరి, పుష్ప పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం


ముంచంగిపుట్టులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నేతలు

ముంచంగిపుట్టు: మహాత్మా గాంధీ అడుగుజాడల్లో అందరూ నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి అధికారులు, పార్టీ నేతలతో కలిసి ఆమె పూలమాలలు వేశారు. ఆయన చూపిన శాంతి మార్గాన్ని పాటిస్తామంటూ అంజలి ఘటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ జాతిపిత గాంధీ చూపిన శాంతియుత మార్గం, సిద్ధాంతాలను పాటించాలని, దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. సత్యాగ్రహం అనే ఆయుధంతో అఖండ భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం ప్రసాదించి పెట్టారన్నారు. 23 పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ సీతమ్మ, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు మూర్తి, జయదేవ్, విగ్రహ దాత ఎస్.కె. రహ్మాన్ పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి : పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు: అహింస, శాంతి మార్గాన్ని అనుసరించి దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించి పెట్టిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. గాంధీ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సుభిక్షమైన దేశ స్వాతంత్ర్య సాధనలో కుల, మత, ప్రాంత, వర్గ భేదాలు లేకుండా అహింసా మార్గమే ఆయుధంగా చేసుకొని పోరాడి కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. అలాంటి మహానుభావుడు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కిల్లు కోటిబాబు నాయుడు, కూడా సురేష్‌కుమార్, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, కిండంగి మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ, నాయకులు కూడా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని నిర్మిద్దాం: ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: గ్రామ స్వరాజ్యానికి పూనుకున్న గాంధీజీ కన్న కలలను సాకారం చేద్దామని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం పిలుపునిచ్చారు. అరకులోయలోని గిరిజన మ్యూజియం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రజల చెంతనే పాలన చేరువ చేసేందుకు మాజీ సీఎం జగన్ గాంధీజీ కలను సాకారం చేస్తూ గ్రామ వార్డు, సచివాలయ వ్యవస్థను నెలకొల్పారన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండే వలంటీరు వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యి ఉంటే మళ్లీ గ్రామ స్వరాజ్యం కచ్చితంగా సాధించేవారమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనతో గిరిజనులు అభివృద్ధికి ఇప్పటికీ దూరంగా ఉండాల్సి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధికి పాటుపడి గాంధీజీ కన్న కలలను సాకారం చేసుకుందామని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, ఎంపీపీ ఉషారాణి, పద్మాపురం సర్పంచ్ సుస్మిత, మాజీ సర్పంచ్ చిన్నారావు, నాయకులు సాంబ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

భగవద్గీతతో ప్రేరణ

రంపచోడవరం/మోతుగూడెం: రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో బుధవారం మహాత్మ గాంధీ జయంతి నిర్వహించారు. పీవో కట్టా సింహాచలం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవో మాట్లాడుతూ ప్రతి పౌరుడు మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలన్నారు. గాంధీ భగవద్గీత ద్వారా ప్రేరణ పొందారని తెలిపారు. ఏపీవో డీఎన్‌వీ రమణ, ఈఈ ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– మోతుగూడెం జెన్‌కో కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. సీఈ జీఎం వాసుదేవరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినకామేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.


మోతుగూడెం సీఈ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది


ఐటీడీఏ సమావేశపు హాలులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పీవో కట్టా సింహాచలం

సమస్యలు పరిష్కారానికి కృషి



గ్రామసభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి: గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. మండలంలోని సున్నంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులు, పని దినాలు తదితర అంశాలు గురించి అధికారులు, ప్రజలతో చర్చించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీటి పరిష్కారానికి అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు చొరవ తీసుకోవాలన్నారు. నిత్యం ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌కు కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో వీరా కిషోర్, సున్నంపాడు సర్పంచ్ లచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అనిల్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి మృతి

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం మండలం కొండకర్ల రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. విశాఖపట్నంలోని గోపాలపట్నంకు చెందిన పెదపాటి రాజు(39) అచ్యుతాపురంలోని అభ్జిత్ కంపెనీలో పనిచేస్తూ కొంత కాలం క్రితం మానివేశాడు. కంపెనీ సహచర స్నేహితులతో కలిసి అచ్యుతాపురం మండలం కొండకర్లలోని రిసార్ట్‌లో మంగళవారం రాత్రి బస చేశారు. తెల్లవారున సమీప స్విమ్మింగ్ పూల్‌లో శవమై కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పాతకోటలో ఏకలవ్య పాఠశాల ప్రారంభం

అనంతగిరి(అరకులోయ రూరల్): అనంతగిరి మండలం పాతకోట ఏకలవ్య పాఠశాల నూతన భవనాలను ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ పద్ధతిలో బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పాల్గొని మాట్లాడుతూ ఎన్నోయేళ్లుగా పాఠశాల ఏర్పాటుకు ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూశారన్నారు. ఇక్కడి గిరిజనులు సొంత పట్టా భూములు ఇవ్వడంతో దీన్ని రూ.40 కోట్లతో పూర్తి చేశారన్నారు. ఇన్నాళ్లకు కల సాకారం అయిందన్నారు. ఇటువంటి పాఠశాల లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇకపై సొంత భవనాలు అందుబాటులోకి రావడంతో స్థానికంగా చదువుకునేందుకు వీలు కలిగిందన్నారు. ప్రిన్సిపాల్ మూర్తి, సర్పంచ్ రూతు, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎంపీపీ నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎక్సైజ్ సీఐ సంతోష్



అరకులోయ టౌన్: ప్రైవేటు మద్యం దుకాణాలకు ఏపీ ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ సంతోష్ బుధవారం తెలిపారు. అరకులోయ సర్కిల్ పరిధిలో అరకులోయ మండలంలో నాలుగు, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. మద్యం దుకాణాలకు ఈ నెల 9న సాయంత్రం అయిదు గంటల లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. లైసెన్సు ఫీజు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డీడీతోపాటు దరఖాస్తు అందించాలన్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు స్థానికులై ఉండాలన్నారు. తహసీల్దారు కార్యాలయం నుంచి ఎస్టీ కుల, నివాస ధ్రువపత్రం సమర్పించాలన్నారు. మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా పొందిన లబ్ధిదారులు మండలంలోని కేటాయించిన నాలుగు దుకాణాలకు మొదటి ఏడాది రూ.65 లక్షలతో పాటు 10 శాతం పెంచి రూ.6.50 లక్షలు చెల్లించాలన్నారు. అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లో మొదటి ఏడాది రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉండగా, రెండో ఏడాది రూ.55 లక్షలతోపాటు రూ.5.50 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. స్థానికులై ఉండి దుకాణాలకు ఎన్నయినా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 11న ఉదయం ఎనిమిది గంటలకు పాడేరులోని వీవీ ఫంక్షన్ హాల్ వద్ద లాటరీని కలెక్టర్ సమక్షంలో తీస్తారని తెలిపారు. 12 నుంచి నూతన మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయన్నారు. లాటరీలో దుకాణాలు పొందిన వారు ఆరు వాయిదాల పద్ధతిలో నిర్దేశించిన సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. మరింత సమాచారం కోసం 9440902393 ఫోన్ చేయాలని తెలిపారు.

రంపచోడవరం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలలో మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 11న పాడేరు వీఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర లాటరీ తీస్తారన్నారు. విశాఖపట్నం రోడ్డు వద్ద ఎంట్రీ పాస్‌లతో హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు సమాచారం కోసం రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గిరిజనులకు దోమతెరల పంపిణీ


గిరిజనులకు దోమతెరలను అందజేస్తున్న డీఎంహెచ్‌వో జమల్‌బాషా

పాడేరు: సీజనల్ వ్యాధులపై గిరిజనులు అశ్రద్ధ చేయకుండా సమీపంలో ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా తెలిపారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ పరిధి మారుమూల చింతగున్నల, వరంకుర, చీడిపాలెం ఆదివాసీ గ్రామాలకు టొయొటాస్ రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సహాయంతో గిరిజనులకు బుధవారం ఆయన దోమతెరలను పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో అధికంగా మలేరియా నమోదైన ఆదివాసీ గ్రామాలకు తొలుత వీటిని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సంస్థ జిల్లా వ్యాప్తంగా రూ.7 లక్షలు వెచ్చించి 20 వేల దోమతెరలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఆరోగ్య పర్యవేక్షకులు వరలక్ష్మి పాత్రో, ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్లు శెట్టి నాగరాజు, ఎలిషారావు, లక్ష్మణరావు, భీమన్న దొర, మూర్తి, వెంకటాచలం, శంకర్‌రావు, వెంకటరమణ, ఎస్పీ పడాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్లలో కారంకొట్టి మెడలో బంగారు చైన్ అపహరణ

రాంబిల్లి (యలమంచిలి) : లాలంకోడూరు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఒక ఇంటిలో నిద్రిస్తున్న వ్యక్తి మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్. నర్సింగరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ తెలిపిన వివరాలివి. లాలంకోడూరు గ్రామానికి చెందిన బండారు సుధీర్‌కుమార్ తన ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి తన ఇంట్లోకి ప్రవేశించి తనపై దాడి చేసి కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

గ్రామ సభలతోనే అభివృద్ధి సాధ్యం

జేసీ అభిషేక్ గౌడ్


గడికించుమండ గ్రామ సభలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్

హుకుంపేట: గ్రామ సభలతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని గడికించుమండ పంచాయతీలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్పంచ్ వర్తన ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మొక్కలు నాటారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయత్ రాజ్ శాఖ ద్వారా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, గ్రామసభల ద్వారా అధికారులు, నాయకులు చర్చించి వీటిని వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంకటరావు, డీటీ రవికుమార్, సర్పంచ్ గుమ్మ శ్యామ్‌సుందర్, పీఆర్ జేఈ సంజీవరావు పాల్గొన్నారు.

బైక్‌ను బొలెరో ఢీకొని అంగన్‌వాడీ హెల్పర్ మృతి


సంఘటన స్థలంలో మృతి చెందిన రోజా


సంఘటన స్థలంలో స్థానికులు

ఆమె భర్తకు, పిల్లలకు గాయాలు

అరకులోయ రూరల్: స్థానిక సినిమా హాల్ సమీపంలో బైక్‌ను వెనుక నుంచి బొలెరో తొట్టి వ్యాన్‌ను ఢీకొని మహిళ మృతి చెందింది. డుంబ్రిగుడ గ్రామానికి చెందిన సాగర రోజా(22) అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తోంది. ఆమె తన భర్త సాగర చిన్ని(34), ఇద్దరు పిల్లలతో కలిసి అరకులోయ నుంచి స్వగ్రామం డుంబ్రిగుడ తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌పై వీరు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన సిమెంట్, రాడ్డుల లోడ్‌తో ఉన్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రోజా అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయలైన చిన్ని, ఇద్దరు పిల్లలకు వైద్య సేవలందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.

మౌనమెందుకు చంద్రబాబు.?

- 'ఉక్కు'ను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలి
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

అగనంపూడి/సీతమ్మధార: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్ష శిబిరానికి వచ్చి ప్రకటించాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు సత్యాగ్రహ దీక్ష శిబిరంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను 48 గంటల్లోగా విధుల్లోకి చేర్చుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించాలని.. లేని పక్షంలో 4వ తేదీ ఒంటి గంట తర్వాత నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి విస్తరించి.. 20 మిలియన్ టన్నులకు విస్తరించేలా బ్లూప్రింట్ సిద్ధం చేశారని గుర్తు చేశారు. ముందుగా ఆమె జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ దిశగా కేంద్రం ముందుకెళ్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదని చంద్రబాబును నిలదీశారు. పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతులు ముత్యాలు, డీసీసీ అధ్యక్షుడు వర్మ, విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అవసరమైతే రాహుల్ గాంధీని తీసుకువస్తా..

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అవసరమైతే ఏఐసీసీ చీఫ్ రాహుల్‌గాంధీని ఇక్కడికి తీసుకొస్తానని.. కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని షర్మిల అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం జరిగిన నిరసనలో ఆమె పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలో మత సామరస్యానికి చిచ్చుపెట్టేలా బీజేపీ పాలన సాగుతోందని ఆరోపించారు. 100 రోజుల అధ్వాన పాలన నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చడం కోసమే లడ్డూ అంశాన్ని చంద్రబాబు తెరపైకి తెచ్చారని షర్మిల ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కాంగ్రెస్ స్వాగతిస్తోందన్నారు. చంద్రబాబు వేసిన సిట్‌పై తమకు నమ్మకం లేదన్నారు. చంద్రబాబు శాంతి పూజలు, పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షల పేరిట ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ఆమె ప్రశ్నించారు.



జాతీయ రహదారిపై బైఠాయించి మాట్లాడుతున్న షర్మిల

ఏటీఎంలో నగదు చోరీ

- ఉత్తరప్రదేశ్ ముఠా అరెస్ట్
- పరారీలో ఇద్దరు నిందితులు

పీఎంపాలెం: ఏటీఎంలలోని చిన్న చిన్న సాంకేతిక లోపాలను ఆసరా చేసుకుని నగదు దొంగతనాలకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాలో ఇద్దరిని పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు క్రైం ఏసీపీ వెంకటరావు తెలిపారు. పీఎంపాలెం నేర విభాగం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. పీఎంపాలెం స్టేషన్ పరిధిలోని ఒక బ్యాంకు ఏటీఎం మెషీన్ నుంచి మంగళవారం రూ.19,500 అక్రమంగా విత్‌డ్రా చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కాగా.. కారుషెడ్ కూడలికి సమీపంలోని కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఏటీఎం కేంద్రం వద్ద బుధవారం గంటల తరబడి ఇద్దరు యువకులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో క్రైం సీఐ బీఎస్ఎస్ ప్రకాష్ సిబ్బందితో వెళ్లి ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ధర్మేంద్ర కుమార్, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏటీఎం మెషీన్లలో చిన్న లోపాలను ఆధారంగా చేసుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు తెలివిగా నగదు చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో పీఎంపాలెం పరిధిలోని ఓ ఏటీఎంలో నాలుగు దఫాలు నగదు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా.. ఒక దఫా రూ.10 వేలు, మరో దఫా రూ.9,500 విత్‌డ్రా చేసినట్లు నిందితులు అంగీకరించారు. మిగిలిన రెండు ప్రయత్నాల్లో విఫలమయ్యారు. వారి వద్ద నుంచి రూ.10 వేలు, 15 ఏటీఎం కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో అరుణ్ కుమార్, దేవేంద్ర ఢిల్లీలను అరెస్ట్ చేయాల్సి ఉందని ఏసీపీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏటీఎం కార్డులను ఉపయోగించే వారు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు ఏటీఎం కేంద్రాల వద్ద కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు


స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు

క్లుప్తంగా

మదర్ థెరిసా అవార్డులు ప్రదానం



అవార్డు గ్రహీతలు ఉపాధ్యాయిని కృష్ణకుమారి, త్రినాథ్

అరకులోయ రూరల్: స్థానిక కేజీబీవీ ఉపాధ్యాయిని, మానవ హక్కుల నేర నిరోధక సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి, స్వచ్ఛంద సేవకుడు త్రినాథ్ సేవలకు గుర్తింపుగా బుధవారం అరకులోయలో మదర్ థెరిసా జాతీయ అవార్డులు వక్తలు ప్రదానం చేశారు. వీటిని అందుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు తెలిపారు. తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

ఉపాధి పనులు గుర్తింపునకు గ్రామసభలు



చినార్యూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సున్నం అభిరామ్

కూనవరం: గాంధీ జయంతి పురస్కరించుకుని మండలంలోని 16 పంచాయతీలకు గాను 13 పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు జరిగినట్లు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో శ్రీకాంత్ తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులకు సంబంధించి గ్రామసభలు ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. 2024–25లో మిగిలిన పనులతో పాటు 2025–26లో చేపట్టబోయే పనులను అధికారులు వివరించారు. వారం రోజులపాటు ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో చెరువులు, ఫారం పాండ్లు, భూమి చదును, డ్రైనేజీలు, సీసీరోడ్లు వంటి పనులకు సంబంధించిన సర్వేలు నిర్వహిస్తారు. చినార్యూరు గ్రామ పంచాయతీ పరిధిలో గుర్తించిన పనులను సర్పంచ్ సున్నం అభిరామ్ వివరించారు.

బలభద్రంలో అన్నదానం



ఆహారం అందిస్తున్న సత్యనారాయణ

కొయ్యూరు: రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ బుధవారం మర్రివాడ పంచాయతీ బలభద్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఆయన వంద మంది ఆదివాసీలకు భోజనాలు పెట్టారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రెండు సంవత్సరాల నుంచి అడవి బిడ్డలకు అన్నదానం పేరిట అనేక మారుమూల గ్రామాల్లో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దుమంతి రామకృష్ణ, పొగడాల అరవింద్, దుమంతి ఓంకార్, ప్రమోద్ వాల్మీకి, స్థానికులు పాల్గొన్నారు.

రేకుల షెడ్లు ధ్వంసంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ముంచంగిపుట్టు: పాడేరు మండలం లగిసిపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రేకుల షెడ్లను కొంత మంది ధ్వంసం చేయడంపై ముంచంగిపుట్టులో బుధవారం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం వినూత్న రీతిలో అందించి నిరసన తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపీడీవో కిరణ్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సురేష్, మోహన్, భూషణ్, శ్రీను, విజయ్‌వెంకట్, మోహన్, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కూనవరం సీహెచ్‌సీలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు



రాజవొమ్మంగి పాఠశాలలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వై.రామవరంలో శానిటేషన్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర



పెదబయలులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వర్తక సంఘ నేతలు

గాంధీ మార్గం అనుసరణీయం

కూనవరం: మండలంలో కోతులగుట్ట సీహెచ్‌సీలో ఏఎస్ఆర్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కృష్ణారావు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అహింస మార్గంతో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. చింతూరు ఏరియా ఆస్పత్రిని 100 పడకలు, కూనవరం సీహెచ్‌సీని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కూనవరం, చింతూరు ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ మహేష్, డాక్టర్ కోటిరెడ్డి, వైద్యులు తేజ, వివేక్ నాయక్, పిల్లల వైద్యులు ప్రజ్వల, ఏవో చంద్రశేఖర్, బొజ్జి, శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్‌సీ కౌన్సిలర్ రమేష్, జోగారావు, స్టాఫ్ నర్స్ వై అనసూర్య పాల్గొన్నారు.

కొయ్యూరు: గాంధీ మార్గం అనుసరణీయమని వైస్ ఎంపీపీ అంబటి నూకాలు అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఇక్కడ గ్రామ సచివాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ శాంతి ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం, వరహాలబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కొయ్యూరులో గాంధీ విగ్రహానికి నేతలు మేడిబోయిన చక్రరావు, తోట దొరబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



జి.మాడుగులలో గాంధీ జయంతి వేడుకలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తదితరులు

రాజవొమ్మంగి: మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించారు. ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, స్థానికులు నివాళులర్పించారు. జాతిపిత గురించి వక్తలు ప్రసంగించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్ఎం గోపాలకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

మారేడుమిల్లి: స్థానిక మెయిన్ సెంటర్ వద్ద గాంధీజీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పి. హరికృష్ణ, లక్కోండ దావిద్, నల్లమిల్లి రామారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి కార్యకర్తలకు పంచిపెట్టారు. గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలలో భాగంగా చివరిరోజు బుధవారం వై.రామవరంలో ఎంపీడీవో కె. బాపన్నదొర ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. స్థానిక సంపద తయారీ కేంద్రానికి తుది మెరుగులు దిద్ది పునః ప్రారంభించారు. అక్కడ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శానిటేషన్ వర్కర్లు ప్రసాదు దంపతులను సన్మానించారు. అన్ని కార్యాలయాలు, సచివాలయాల్లోను ఈ కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎటపాక: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉప సర్పంచ్, నాయకులు

పెదబయలు: స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి స్థానిక వర్తన సంఘ నాయకులు, మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. వర్తక సంఘం నేతలు త్రినాథరావు, ఎస్.కె. అబ్దుల్లా, భాస్కరరావు, చిరంజీవి, మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెండా సన్యాసి, కోమటి పరుశురాం పాల్గొన్నారు.

జి.మాడుగుల: జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపనకు రూపకల్పన చేసి గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారని వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, ఎంపీటీసీ ఎం. వియజకుమారి, సర్పంచ్‌లు కె. రాంబాబు, ఐసరం హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్, మండల నాయకులు సిర్మా పండన్న, వలసయ్య, బాలయ్యపడాల్, కూర్మన్‌రాజు, కుడుముల లక్ష్మణ్, వెంకటరావు పాల్గొన్నారు

ఎటపాక: త్రిపురాపెంటపాడు గ్రామ సచివాలయంలో జాతిపిత గాంధీజీ చిత్రపటానికి ఉప సర్పంచ్ గద్దల కుమారితో పాటు సిబ్బంది, పలు పార్టీల నాయకులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పంచాయతీ కార్యదర్శి శిరీష, సుస్మా పాల్గొన్నారు.

ఎంపీడీవో కిరణ్‌కుమార్ సేవలు ఆదర్శం



ఎంపీడీవో కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ప్రజాప్రతినిధులు



ఎంపీడీవో జయసాగర్‌ను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌లు, నాయకులు



ఎంపీడీవో వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై తన సొంత జిల్లా పశ్చిమ గోదావరికి వెళ్తున్న కిరణ్‌కుమార్‌కు బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సైతం ఎంపీడీవోకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తరహాలో కాకుండా మానవతా దృక్పథంతో విధులు నిర్వహించిన వ్యక్తి ఎంపీడీవో కిరణ్‌కుమార్ అని అన్నారు. గిరిజనులతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల అధ్యక్షులు పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపీడీవో ఘన సన్మానం

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో లోహిత్ జయసాగర్‌కు బుధవారం వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసి కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్తున్న జయసాగర్ మన మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సిర్మా పండన్న, వలసయ్య, లక్ష్మణ్, అడపా బాబూరావు, కూర్మన్‌రాజు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మచిలీపట్నానికి బదిలీ అయిన ఎంపీడీవో వెంకటేష్‌ను ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీలు సాధారణమే అన్నారు. ఉత్తమ సేవలందించి ప్రజల్లో మన్ననలు పొందిన వారు బదిలీపై వెళ్లడం బాధాకరం అన్నారు. ఇదే విధంగా అక్కడ పని చేసి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ దురియా ఆనంద్‌కుమార్, నాయకులు నర్సింహమూర్తి, బాలు, రామూర్తి పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

- ముస్తాబైన కొయ్యూరు దుర్గమ్మ తల్లి
- ఇంద్రకీలాద్రి మాదిరిగా కొండపై ఆలయం



కొయ్యూరులో దుర్గమ్మ తల్లి

కొయ్యూరు: శరన్నవరాత్రులకు కొయ్యూరు దుర్గమ్మ తల్లి ఆలయం సిద్ధమైంది. మరో ఇంద్రకీలాద్రిని తలపించే విధంగా ఇక్కడ కొండపై ఆలయం ఉంది. తల్లి దర్శనం కోసం వందకు పైగా మెట్లను ఎక్కాల్సి ఉంటుంది. నవరాత్రుల సందర్భంగా విద్యుదీకరణతో అలంకరణ చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు భవానీమాలలు ధరించారు. కోరిన కోర్కెలు నెరవేరుస్తుందన్న నమ్మకంతో పలు గ్రామాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తారు. కొయ్యూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో వారు ఇక్కడకు వచ్చి నవరాత్రులు ముగిసేంత వరకు భవానీ మండల దీక్షలు చేస్తారు. దసరాను వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేస్తారు.



దూసరపాముగుడిలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

రాజవొమ్మంగి: దుర్గాదేవి నవరాత్రోత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం దుర్గాదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొలిరోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనం ఇవ్వనున్నారు. మరోవైపు ఇళ్ల వద్ద గృహిణులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా వలస వెళ్లిన వారుతోపాటు బంధువుల రాకతో ప్రతి ఇల్లు కళకళలాడుతూ కనిపిస్తోంది.

గుంటసీమలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

సీపీఎం నాయకులు పోతురాజు, సూర్యనారాయణ డిమాండ్



గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు పోతురాజు, సూర్యనారాయణ

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.బి. పోతురాజు, నాయకుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం వారు ఇక్కడ గిరిజనులతో కలిసి మాట్లాడారు. తూటంగి, లైగండ, గుంటసీమ, రంగిలిసింగి, గుంటగన్నేల పంచాయతీల పరిధిలో 55 గ్రామాల్లో 15 వేల జనాభా ఉన్నారని, వీరంతా అనారోగ్యం పాలైతే సుమారు 15 నుంచి 20 కిలోమీటర్లు దూరంలో డుంబ్రిగుడ, అరకులోయ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నాలుగు పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గుంటసీమలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పార్టీ జెండా ఆవిష్కరించి, సీతారామ్ ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. పి. డొంబు, పి. మోహన్‌దాస్, జైరామ్, లోకిరం, భగవాన్ పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ ఆట



బతుకమ్మ పూలకు పూజలు చేస్తున్న దృశ్యం

ఎటపాక: భావితరాలకు బతుకమ్మ ఆట ఆచార సంప్రదాయాలు అందించడమే లక్ష్యమని తోటపల్లి ఆదిత్య స్కూల్ చైర్మన్ వెంకట్ తెలిపారు. బుధవారం స్థానిక ఆదిత్య పాఠశాలలో బతుకమ్మ సందడి నెలకొంది. వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సరియావలస బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియావలస గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ గుమ్మ తనూజరాణి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ 2022–2023లో ఇచ్చిన నిధులతో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఫాల్గుణ గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. డుంబ్రిగుడ నుంచి గుంటసీమ రోడ్డు, కిల్లోగుడ నుంచి సొవ్వ, అరకు నుంచి కొల్లాపుట్టు రోడ్డు, బిల్లాపుట్టు నుంచి బిజుమరవలస, కించుమండ జంక్షన్ నుంచి కితలంగి రోడ్డు గత ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. అందులో భాగంగానే గుంటసీమ రోడ్డు నుంచి సరియావలస వరకు రోడ్డును మంజూరు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రేమనందం, జక్కయ్య, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఎటపాక: గన్నవరం సచివాలయంలో బుధవారం పారిశుధ్య కార్మికులను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సర్పంచ్ భద్రమ్మ, ఎంపీటీసీ కంటిరాజు, నాయకులు బోల్ల పుల్లయ్య, సెక్రటరీ స్వాతి దేవి, మహిళా పోలీస్ కృష్ణవేణి, వెల్ఫేర్ జయ, వెటర్నరీ రాంప్రసాద్, మున్ని, డిజిటల్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

పిడుగు పాటుకు దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన దుక్కిటెద్దు

హుకుంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉరుములు, మెరుపులు పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రంగశీల పంచాయతీకి చెందిన కుమడ సీతారాం అనే గిరిజనుడు తన దుక్కిటెద్దును గ్రామ సమీపంలో మేత కోసం తోలుకెళ్లగా పిడుగుపాటుకు గురై మృతి చెందింది.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత



రాజవొమ్మంగిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం వంటి కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో ఎల్. యాదగిరీశ్వర్రావు అన్నారు. సచివాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది రాజవొమ్మంగిలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. బడదనాంపల్లిలో ఈ కార్యక్రమం జరిగింది. పరిసరాల పరిశుభ్రతపై ఎంపీడీవో స్థానికులకు అవగాహన కలిగించారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన లారీ

నిలిచిపోయిన వాహన రాకపోకలు



రోడ్డు మధ్యలో లారీ కూరుకుపోవటంతో నిలిచిపోయిన వాహనాలు

జి.మాడుగుల: పాడేరు రోడ్డులో సంతబయలు గ్రామ సమీపాన బుధవారం లోడ్‌తో వెళ్తున్న లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. కొంత సమయం వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జి.మాడుగుల–పాడేరు మార్గంలో హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. జి.మాడుగుల వైపు నుంచి పాడేరు వెళుతున్న లోడ్ లారీ గోతులో కూరుకుపోయింది. దీంతో పాడేరు, అరకు వైపు, జి.మాడుగుల, చింతపల్లి, వంజరి, గూడెంకొత్తవీధి, తాజంగి, సొలభం సుర్మతి వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. జేసీబీతో రోడ్డుకు అడ్డంగా కూరుకుపోయిన లారీని పక్కకు నెట్టటంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగించాయి.

30 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్

అడ్డతీగల: సారా కలిగి ఉన్నాడనే అభియోగం మేరకు మండలంలోని రాయపల్లికి చెందిన పిల్లారిశెట్టి సూర్యారావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జి.వినోద్ బుధవారం తెలిపారు. మండలంలోని దుప్పులపాలెం శివారులో అతడి నుంచి 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

సూరిరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, జిల్లా నాయకుడు శాంతిరాజు

వై.రామవరం: మండలంలోని దేవరమడుగులు గ్రామ సమీప కొండల్లో అనుమానాస్పదంగా మృతి చెందిన లోత సూరిరెడ్డి కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. గత నెలలో మృతి చెందగా, ఇంతవరకు బాధిత కుటుంబానికి న్యాయం జరగలేదని ఆరోపించారు. మృతుని భార్య వెంకటలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భర్త చనిపోయి ఏ విధమైన ఆధారం లేని ఆమె తన ఇద్దరు పిల్లలను ఎలా పోషిస్తుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సూరిరెడ్డి కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కంభం శాంతిరాజు పాల్గొన్నారు.